చిన్నారుల ఆరోగ్యం పై శ్రద్ధ చూపించాలి : ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-కె.కోటపాడు: అంగన్వాడీ కేంద్రాల్లోఉన్న చిన్నారులకు పరిశుభ్రతతో కూడిన పోషకాహారంతో పాటు క్రమశిక్షణ నేర్పించవలసిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలదేనని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో 8వ పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో ప్రారంభించిన అంగన్వాడీ వ్యవస్థ విజయవంతంగా నడుస్తుంది అన్నారు. చిన్నారులు ఎక్కువగా కార్యకర్తల క్రమశిక్షణలోనే ఉంటారని బాలలను పెంచే తల్లులుగా మంచి పేరు సంపాదించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో అక్కడక్కడ జరుగుతున్న బాల్యవివాహాలను నిరోధించవలసిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలదేనన్నారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు అవగాహన కలిగించడం, అలాగే తల్లిపాల విశిష్టతపై తల్లులకు వివరించాలని, చిరు ధాన్యాల వినియోగంపై కూడా ఎక్కువగా ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు. ఉత్తమ ప్రతిభ చూపించిన అంగన్వాడీ కేంద్రాలకు మండల స్థాయిలో అవార్డులు అందజేస్తానని ఎమ్మెల్యే బండారు ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐసిడిఎస్ పిఓ లలిత కుమారి మాట్లాడుతూ ఈనెల 16 వరకు ప్రతి గ్రామంలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ పరిధిలో 150 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని 4 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ , రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ ఎంపీడీవో సాంబశివరావు తహసీల్దార్ భుజంగరావు సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని దేశం నాయకులు దోకల నరసింహమూర్తి , పూడి నారాయణమూర్తి, కన్నూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు వ్యవసాయ రంగానికి మేలు

మండల టీడీపీ అధ్యక్షులు పెంటకోట విజయ్

విశాలాంధ్ర -మునగపాక: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని మండల టీడీపీ అధ్యక్షులు పెంటకోట విజయ్ పేర్కొన్నారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో జీఎస్టీపై సమావేశం సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. రైతాంగానికి మేలు చేసే విధంగా సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఎన్నో కార్యక్రమాలు,పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు చేయటం శుభ పరిణామం అన్నారు.జీఎస్టీ 2.0 ద్వారా కలిగే లబ్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు.రైతుల ట్రాక్టర్లు,విత్తనాలపై సబ్సిడీల ద్వారా జీఎస్టీ తగ్గింపు ద్వారా వ్యవసాయంలో లాభసాటి పెరుగుతుందన్నారు.జీఎస్టీ తగ్గింపువల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి,వాటిపై అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు,జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహ నర్సింగరావు,పిఎసిఎస్ అధ్యక్షులు విల్లూరి నూక నర్సింగరావు, మాజీ వైస్ ఎంపీపీ ఉల్లింగల గోవింద్,యూనిట్ ఇంచార్జ్ పొలమరశెట్టి మహేష్, తోటాడ గ్రామ శాఖ అధ్యక్షులు దాడి గంగాజీ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరిశెట్టి అప్పలనాయుడు,టీడీపీ సీనియర్ నాయకులు ఆడారి అబ్బాయి నాయుడు,బీలా లక్ష్మణరావు,మొల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ స్టేట్ బ్యాంకులో! డ్వాక్రా రుణాలు స్వాహా!

- స్టేట్‌బ్యాంక్ ను ముట్టడించిన డ్వాక్రా మహిళలు
...మూడు గంటల పాటు బ్యాంకు మూసివేత
..నిలిచిన లావాదేవీలు ....
- వెలుగు సిబ్బంది చేతివాటం, ...
రూ.కోటి 20 లక్షల స్వాహా

విశాలాంధ్ర-చోడవరం : మండలంలోని గోవాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సుమారు రూ. 7.50 లక్షలు డ్వాక్రా రుణాలను బ్యాంకు అధికారులు స్వాహా చేశారని, తమకు న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేస్తూ, సింహాద్రిపురం గ్రామ శివారు సబ్బవరపు కళ్ళాలకు చెందిన మహిళలు సోమవారం గోవాడ స్టేట్ బ్యాంకు వద్ద ఆందోళనకు దిగారు. బ్యాంకు తెరిచే సమయానికి బాధిత డ్వాక్రా మహిళలు బ్యాంక్ సిబ్బందిని లోపలికి వెళ్లకుండా అడ్డంగా కూర్చుండిపోయారు. దీంతో సుమారు మూడు గంటలపాటు బ్యాంకు లావాదేవీలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు నచ్చచెప్పినప్పటికీ మహిళలు ఆందోళన విరమించలేదు. దీనిపై వివరాల్లోకి వెళితే,.. గ్రామానికి చెందిన సిద్ధి వినాయక, శ్రీ రామ డ్వాక్రా సంఘం, అలాగే మరికొన్ని సంఘాల వారు బ్యాంకు నుండి ఎటువంటి రుణము తీసుకున్నప్పటికీ, ... తీసుకున్నట్లుగా ఉండడంతో కొత్తగా తమకు లోన్ ఎవరూ ఇవ్వడం లేదని దీనిపై పలుమార్లు బ్యాంకు సిబ్బంది అడిగినప్పటికీ ఫలితం లేదని మహిళలు వాపోయారు. 2024 ఫిబ్రవరిలో దీనిపై గతంలో పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. సిద్ధి వినాయక గ్రూప్ పేరుతో సుమారు రెండు లక్షల రూపాయలు, శ్రీరామ డ్వాక్రా సంఘం పేరుతో 7.50లక్షల రూపాయలు లోన్లు తాము తీసుకోపోయినను,... తీసుకున్నట్లు చెబుతున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకుని తక్షణమే తమకు ఎన్ఓసి ఇప్పించాలని, ... లేకుంటే తాము ఆందోళన విరమించేది లేదని డ్వాక్రా మహిళలు సుమారు మూడు గంటలకు పైగా ఆందోళనకు దిగారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల మధ్య పోలీసులు డ్వాక్రా మహిళలకు నచ్చచెప్పారు. ఆందోళనకు దిగిన వారిలో ఎస్. శివలక్ష్మి, శ్రీదేవి, వి.గీతాకుమారి, సన్యాసమ్మ, వి.సూర్య యోగిత, ఎస్.సంధ్య, మణి, వెంకటలక్ష్మి, తదితరులు వున్నారు. వెలుగు ఏపీవో దామోదర్ తిలక్ సింహాద్రిపురం వెంకన్నపాలెం, ముద్దుర్తి నరసయ్యపేట గ్రామాల్లో గల నాలుగు డ్వాక్రా మహిళా గ్రూపుల నుండి సుమారు కోటి 20 లక్షల రూపాయలు ఏడాది క్రితమే స్వాహా అయినట్లు గుర్తించామన్నారు. వెలుగు వివో సి.ఎ లు స్వాహా చేసినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని, వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం ఉన్నతాధికారుల సిఫార్సుల మేరకు విధుల నుండి తొలగించినట్లు తెలిపారు. డ్వాక్రా నిధులు స్వాహా చేసిన వారిపై పోలీసల కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 80 లక్షల మేర రికవరీ చేశామన్నారు. మిగిలిన సొమ్ము రికవరీ చేసేందుకు పోలీసులను సంప్రదిస్తున్నామన్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. చోడవరం సిఐ అప్పలరాజు, ఎస్ ఐ జోగారావులు మహిళలు, బ్యాంకు సిబ్బందితో సంప్రదింపులు జరిపి, సుమారు మూడు గంటల ఆందోళన అనంతరం బ్యాంకు విధులకు ఆటంకం లేకుండా మహిళల ఆందోళనను విరమింప చేశారు.

పొట్నూరు ప్రసాద్ కు గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామానికి చెందిన తాసుబిల్లి ఫౌండేషన్ సభ్యులు పొట్నూరు ప్రసాద్ కి డేస్ స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ, టెక్సస్ లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజిక మార్పుతో అన్ని రంగాల్లో అందరూ పడుతున్న ఇబ్బందులు, పల్లెల్లో, మారుమూల ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గ్రహించి, తాసుబెల్లి ఫౌండేషన్ అనే ప్లాట్ ఫామ్ ను ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రసాద్ రక్తదాన శిబిరాలు నిర్వహించి, ఎంతోమంది రక్తదాతలను తయారు చేసి రక్తదాన సేవలతో మమేకమై నిస్వార్ధ సేవలను గుర్తించి డేస్ స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ, టెక్సస్, అమెరికా వారు గుర్తించి హైదరాబాదులో 6వ తేది అక్టోబర్ 2025 న, గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు గాడ్స్ సన్ హెూలీ స్పిరిట్ అకాడమీ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ రహిమాన్, ప్రెసిడెంట్ మరియ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఇజ్రాయిల్, హైదరాబాద్ లో ప్రముఖులు సీనియర్ మూవీ ఆర్టిస్ట్ లు, శ్రీనివాస్, డాక్టర్ బలిరెడ్డి పృథ్వీ రాజ్, అనింగి రాజశేఖర్, తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు పాల్గొన్నారు.

సముద్రంలో విద్యార్థి గల్లంతు

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని పాల్మాన్ పేట సముద్ర తీరం వద్ద అలల తాకిడికి కోటవురట్ల మండలం, కే.వెంకటాపురం గ్రామానికి చెందిన పి.అశోక్ గల్లంతయ్యాడు. నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న అశోక్ 11 మంది స్నేహితులతో కలిసి పాల్మాన్ పేట సముద్ర తీరానికి పిక్నిక్ కు వచ్చారు. భోజనాలు అనంతరం అశోక్ మరో స్నేహితులతో చేతులు కడుక్కునేందుకు సముద్రం వద్దకు వెళ్ళగా అక్కడ పెద్ద అలలు రావడంతో ఇద్దరూ సముద్రంలో కొట్టుకుపోయారు. పరిస్థితి గమనించిన మత్స్యకారులు ఒక విద్యార్థిని కాపాడగా, అశోక్ సముద్రంలో కొట్టుకుపోయారు. గాలింపు చర్యలు చేపట్టిన అశోక్ ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని కాల్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -దేవరాపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నిప్పుపెట్టి కాల్చిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దేవరాపల్లి అంబేద్కర్ యూత్ సంఘం, మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కాటపల్లి అప్పారావు స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలం, దేవళం పేటలో గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాంను కాల్చడం అమానుషమైన చర్యగా పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే అంబేద్కర్ విగ్రహాన్ని పునః ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. దీనికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మళ్లీ ఇటువంటి దుస్స సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాసుపత్రికి రోజు రోజుకు పెరుగుతున్న రోగుల తాకిడి

- వాతావరణం మార్పులతో ప్రబలుతున్న అంటువ్యాధులు

విశాలాంధ్ర-చోడవరం : ఇటీవల కురుస్తున్న వర్షాలతో చోడవరం చుట్టుపక్కల గ్రామాల్లో ప్రబలుతున్న అంటు వ్యాధులు, విష జ్వరాలతో చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు తాకిడి ఎక్కువైందని ఆసుపత్రి సూపరెంటెంట్ దినేష్ కుమార్ తెలియజేశారు. గతంలో సాధారణ ఓపి 100 నుండి 150 వరకు ఉండేదని,... ప్రస్తుతం 150 నుండి 400 పై వరకు ఓపి నమోదవుతున్నట్లు సోమవారం మీడియాకు తెలిపారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధుల రోగులు ఎక్కువగా వస్తున్నట్లు తెలిపారు. చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సౌకర్యాలు అన్నివేళలలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. మందుల కొరత లేదన్నారు. వాతావరణ మార్పులను బట్టి ప్రజలు కొన్ని ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన మంచి నీటిని తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. చుట్టుపక్కల వాతావరణ పరిస్థితులు పరిశుభ్రంగా ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని సూచించారు. జ్వరం, ఇతర వ్యాధుల అనుమానం ఉన్నట్లయితే తక్షణమే దగ్గరలో గల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఎస్పీ ప్రజా ఫిర్యాదుల వేదికలో 52 ఫిర్యాదులు

విశాలాంధ్ర-అనకాపల్లి బ్యూరో: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక లో ఎస్పీ తుహిన్ సిన్హా 52 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు-32, కుటుంబ కలహాలు-5, మోసాలకు సంబంధించినవి-3, ఇతర విభాగాలకు చెందినవి-12 గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా సంబంధిత అధికారులకు ఆదేశిస్తూ,"ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలి. చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలి," అని సూచించారు. ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యం. ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో జిల్లా పోలీసులు పూర్తి కట్టుబాటుతో పని చేస్తున్నారని తెలిపారు." కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు తో పాటు ఎస్సైలు మల్లేశ్వరరావు, వెంకన్న ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం సాకారం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి : ప్రజల సహకారంతోనే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం సాకారం అవుతుందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం స్థానిక పెంటకోట కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2025 జిల్లాస్థాయి అవార్డుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటం లో అహర్నిశలు శ్రమిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రజలు సహకరించాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు ఎంతో గౌరవనీయులు అన్నారు. గ్రామం శుభ్రంగా ఉంచడంలో గ్రామస్తుల భాగస్వామ్యం ముఖ్యమని, చెత్తను రోడ్లమీద, కాలువలలో వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్తగా విడదీసి అందజేసి వారికి సహకరించాలని తెలిపారు. ప్రజలు ఇంటితోపాటు వారు నివసిస్తున్న వీధి, గ్రామం పరిశుభ్రత బాధ్యత కూడా తీసుకోవాలని తెలిపారు. కోవిడ్ వ్యాధి మనకు ఒక హెచ్చరిక అని, భవిష్యత్తులో అటువంటి మహమ్మారులు విజృంభించకుండా పరిసరాల పరిశుభ్రత ద్వారా ఎదుర్కోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించేందుకు కృషి చేసిన సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు పొందిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర (SASA) కార్యక్రమం ఉత్తమంగా నిలిచిన వారికి అవార్డులు బిఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడరు కేటగిరీలో అనకాపల్లి మండలం మార్టూరు గ్రామ పంచాయతీ ఆర్. అప్పారావు, కె. కోటపాడు మండలం చౌడువాడ గ్రామ పంచాయతీ కి చెందిన ఎ. అప్పారావు, అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం గ్రామ పంచాయతీ కి చెందిన వి.నూకాలమ్మ, ఎస్.రాయవరం మండలం గుడివాడ గ్రామపంచాయతీకి చెందిన డి. కాసులు, ఉత్తమ స్వచ్ఛత స్వచ్ఛంధ సంస్థ కేటగిరీలో అనకాపల్లి మండలం తుమ్మపాలలో గల శారదావేలీ డవలప్మెంట్ సొసైటీ బిఉత్తమ స్వచ్ఛత వారియర్ కేటగిరీలో నర్సీపట్నం మునిసిపాలిటీ కి చెందిన మార్తి అప్పారావు , పరిపాటి బాలయలమంచిలి మునిసిపాలిటీ కి చెందిన కంద్రకోట వెంకటేష్ గుడబండి వరలక్ష్మి జివిఎంసి అనకాపల్లి జోన్ కు చెందిన కశింకోట గోవింద అప్పలస్వామి, స్వచ్ఛ అంగన్వాడీ కేటగిరీలో సబ్బవరం మండలం అమృతపురం అంగన్వాడి కేంద్రం చోడవరం మండలం చాకిపల్లి అంగన్వాడి కేంద్రం, రావికమతం మండలం మేడివాడ అంగన్వాడి కేంద్రం, నక్కపల్లి మండలం ఎన్. నరసాపురం అంగన్వాడి కేంద్రం, నర్సీపట్నం మండలం వేములపూడి అంగన్వాడి కేంద్రం, స్వచ్ఛ బస్సు స్టేషన్ల కేటగిరీలో నాతవరం బస్సు స్టేషను బిస్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు కేటగిరీలో జిల్లా కలెక్టరు కార్యాలయం, జిల్లా సూపరింటెండెంటు ఆఫ్ పోలీసు వారి కార్యాలయం, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వారి కార్యాలయం స్వచ్ఛ గ్రామపంచాయతీలు కేటగిరీలో నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామపంచాయతీ, అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం గ్రామ పంచాయతీ, అనకాపల్లి మండలం మార్టూరు గ్రామ పంచాయతీ, మునగపాక మండలం వొంపోలు గ్రామపంచాయతీ, బిస్వచ్ఛ ఆసుపత్రులు కేటగిరీలో రావికమతం మండలం కొత్తకోట పి.హెచ్.సి. అనకాపల్లి జిల్లా అసుపత్రి, జి.ఎ.డి. అనకాపల్లి, స్వచ్ఛ వసతిగృహాలు కేటగిరీలోప్రభుత్వ సాంఘికసంక్షేమ ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహం, కశింకోట, ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసత్తగృహం, నర్సీపట్నంప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, తాటిపర్తి స్వచ్ఛ పరిశ్రమలు కేటగిరీలో...మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్, అచ్యుతాపురంస్వచ్ఛ మునిసిపాలిటీ కేటగిరీలో నర్సీపట్నం మునిసిపాలిటీ, బిస్వచ్ఛ రెసిడెన్సియల్ పాఠశాలల కేటగిరీలో డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, నర్సీపట్నం, స్వచ్ఛ రైతుబజారు కేటగిరీలో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో నర్సీపట్నం మండలం ఎ.పి.ఎం.ఎస్. వేములపూడి

కె. కోటపాడు మండలం కె.జి.బి.వి. కె. కోటపాడు, అనకాపల్లి, ఎం.పి.ఎల్. గవరపాలెం పరవాడ మండలం జి.హెచ్.ఎస్. తానాం నక్కపల్లి మండలం, జెడ్.పి.హెచ్.ఎస్. వేంపాడు బిస్వచ్ఛ ఎస్.ఎల్.ఎఫ్.ల కేటగిరీలో సీతారామ స్లమ్ సమాఖ్య, యలమంచిలి శ్రీ సాయిబాబా స్లమ్ సమాఖ్య, యలమంచిలి, బిస్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్ కేటగిరీలో చీడికాడమండలం, చేడిపల్లి నక్కపల్లి మండలం డొంకాడ కశింకోట మండలం జి.భీమవరం గొలుగొండ మండలం గొలుగొండ ఎంపికయ్యాయి. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవిందసత్యనారాయణ. వివిధ కార్పొరేషన్ ల చైర్మన్ లు, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కాసులు ముడితే కన్నెత్తయినా చూడరు...!

నిద్రమత్తులో అటవీశాఖ...

- సమాచారం ఇస్తేనే పట్టుకుంటామంటున్న ఫారెస్ట్ అధికారులు ...

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం నియోజకవర్గంలో అటవీ శాఖ ప్రభుత్వ అనుమతులు లేకుండా అకేషియా, టేకు చెట్లను, అడవులను యదేచ్ఛగా నరికేస్తున్నను అటవీ శాఖ అధికారులు ముద్దు నిద్ర నటిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీశాఖ, రెవెన్యూ అధికారులు అనుమతి లేకుండా, గిరి ప్రాంతాలు ప్రభుత్వ భూముల్లోనూ విలువైన అటవీ సంపదను ఇష్టానుసారం నరికేస్తున్న అక్రమార్కులు సీ ఫీజు ల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. లికాసులు ముడితే, అధికారులు అక్రమార్కుల వైపు కన్నెత్తి చూడరులి అని స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్షల రూపాయలు విలువచేసే చెట్లను నరికేస్తుంటే సమాచారం ఉన్నను, తెలియనట్టు నటిస్తున్న అటవీశాఖ అధికారులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తేనే, తప్ప అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అడవులను, చెట్లను కాపాడాలని, ... ప్రభుత్వ అధికారులు స్పందించాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సముద్ర తీరం వెంట ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలపై

జాతీయ మత్స్యకార సంఘం చైర్మన్ నందకుమార్ కు వినతిపత్రం అందజేసిన మోసా అప్పలరాజు

విశాలాంధ్ర-పాయకరావుపేట: కాకినాడ, అనకాపల్లి జిల్లాలలో సముద్ర తీరం వెంట ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలపై జాతీయ మత్యకార సంఘం చైర్మన్ నందకుమార్ కు వినతిపత్రం అందజేసినట్లు జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు తెలిపారు. చత్తీస్ గడ్ రాష్ట్రం రాయపూర్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి, అక్కడి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జాతీయ మత్స్యకార సంఘం చైర్మన్ కు వినతిపత్రాలు అందజేశామన్నారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి లో బల్క్ డ్రగ్ పార్క్, కాకినాడ జిల్లా లో ఏర్పాటు చేస్తున్న అరబిందో, దివిస్ పరిశ్రమల గురించి వారితో చర్చించామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల మత్స్యకారులకు జరుగుతున్న నష్టం పై వివరించామన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన పరిశ్రమల వల్ల జరిగిన నష్టాన్ని వారికి తెలియజేసినట్లు తెలిపారు. మత్స్యకారులను సముద్రం నుండి దూరం చేసేలా ప్రభుత్వాలు చూస్తున్నాయని వివరించారు. ఏర్పాటు చేయబోయే పరిశ్రమలను రద్దు చేయాలని మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు.

జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ ఎంపిక ప్రారంభం

విశాలాంధ్ర -యస్.రాయవరం : మండలంలోని రేవు పోలవరం గ్రామంలో ఉమ్మడి విశాఖ జిల్లా బీచ్ వాలీబాల్ పోటీలను ఎంపీపీ వెంకటలక్ష్మి ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపికలో భాగంగా జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రేవు పోలవరం లోని ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా పోటీలకు అండర్ 14,17 విభాగంలో బాలుర బాలికల ఎంపిక కోసం పలువురు క్రీడాకారులు హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కొరుప్రోలు పిఎసిఎస్ అధ్యక్షుడు గుర్రం రామకృష్ణ టిడిపి సీనియర్ నాయకులు ఎన్. వెంకటరాజు, ప్రత్తిపాటి సత్యనారాయణ, కోడ లోవరాజు , అడవి రాజు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్ పై విస్తృతంగా మండల,గ్రామలలో అవగాహన కల్పించాలి : కలెక్టర్

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి: :సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ పై విస్తృతంగా మండల, గ్రామలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఎస్ ఆర్ శంకరన్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా చేనేత , జౌళి శాఖ, పరిశ్రమల శాఖ , పౌర సరఫరాల శాఖ ల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ తగ్గింపు అనే నినాదంతో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్ ను కలెక్టర్ విజయ క్రిష్ణన్, స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి తో స్టాల్స్ ప్రదర్శనను సందర్శించారు. ఈ ప్రదర్శన లో ఏటి కొప్పాక బొమ్మలు, పాయకరావుపేట పట్టు చీరలు, బంగారయ్యపేట మదుపర్కాలు, ఎమ్మిగనూరు దుపట్లు , టవల్స్, జిల్లా మహిళా సమాఖ్య గ్రూప్స్ వారి ఉత్పత్తులను ప్రదర్శించి ప్రజలకు జీఎస్టీ తగ్గింపులు పై అధికారులు అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శన కార్యక్రమం లో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రసాద్, జిల్లా చేనేత , జౌళి శాఖ అధికారి యం యశ్వంత్, జి ఎస్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర-పాయకరావుపేట: జీఎస్టీ 2.0 పై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి జి. రమేష్ బాబు తెలిపారు. ఈ పోటీలలో మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలో పాఠశాల, మండల స్థాయి పోటీలు నిర్వహించగా, 7వ తేదీన కసింకోటలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

వేములపూడి అంగన్వాడి టీచర్ కు స్వచ్ఛంద అవార్డు

విశాలాంధ్ర-నర్సీపట్నం: స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్ లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వేములపూడి అంగన్వాడి సెంటర్ 2 వర్కర్ గడమల ఆశా జ్యోతికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు, ప్రశంసాపత్రం లభించింది. కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు మళ్ళ సురేంద్ర తదితరులు హాజరయ్యారు. దీనిలో భాగంగా నర్సీపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడి కేంద్రం నిర్వహణ అన్ని విభాగాల్లోను విజయవంతంగా నిర్వహించినందుకు గాను వేములపూడి అంగన్వాడి కేంద్రం -2 వర్కర్ గడమల ఆశాజ్యోతికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. ముఖ్య అతిథులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్, జి. వి. రమణి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.